క్లుప్తంగా

కోవిడ్ కేసులు నిల్

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 25 మందికి పరీక్షలు చేయగా అందరికీ నెగిటివ్ రిపోర్టులు వచ్చినట్లు వైద్యాధికారులు తెలియజేశారు. ఎవరికైనా కోవిడ్ లక్షణాలున్నట్లు అనుమానం ఉంటే వెంటనే దుండిగల్ పీహెచ్‌సీ, షాపూర్‌నగర్ యూపీహెచ్‌సీ, సూరారం కాలనీ యూపీహెచ్‌సీలలో పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారులు సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కావడంతో రోడ్డు నెంబర్ 6, 7లలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. మిగతా బస్తీల్లోని పెండింగ్ రోడ్ల పనులను త్వరలోనే పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

ఏబీవీపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్‌గా నగేష్



రంగారెడ్డినగర్: మేడ్చల్ జిల్లా అఖిల భారత విద్యాపరిషత్ (ఏబీవీపీ) కన్వీనర్‌గా గాజులరామారం ప్రాంతానికి చెందిన రేగోడ్ నగేష్ నియమితులయ్యారు. శనివారం నగరంలోని ఏబీవీపీ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన గ్రేటర్ హైదరాబాద్ సమావేశంలో రాష్ట్ర నాయకత్వం నగేష్‌ను మేడ్చల్ జిల్లా కన్వీనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి రుణపడి ఉంటానని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతూ వారికి న్యాయం జరిగేలా చూస్తానని పేర్కొన్నారు.

ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్లు లక్ష్మీకుమారి, సుజాత

నిజాంపేట్: ప్రగతినగర్ సీనియర్ సిటిజెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి కార్పొరేటర్లు జొన్నలగడ్డ లక్ష్మీకుమారి, సుజాత హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి భార్గవి, ద్వితీయ బహుమతి తేజశ్విని, తృతీయ బహుమతి రజనీ, కన్సలేషన్ బహుమతులను నీరజ, నళిని గెల్చుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నాం

దుండిగల్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. శనివారం మల్లంపేట్ 26వ వార్డులో పర్యటించిన ఆయన స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూనతంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఉంటాయని, స్థానికంగా సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కేవీఆర్ కాలనీ ప్రెసిడెంట్ చంద్ర, ప్రణీత నేచర్ బౌంటీ కాలనీ ప్రెసిడెంట్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ అమృత, కాలనీ సభ్యులు సురేష్, వెంకట్, శ్రీనివాస్, మధుసూదన్, ప్రకాష్, సుధీర్, స్మిత, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణతో ట్రాఫిక్ సమస్యలకు చెక్

నిజాంపేట్: ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు ప్రధాన చౌరస్తాల్లో రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్ల నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి చౌరస్తాలో రోడ్డు అభివృద్ధి, ఫ్లైఓవర్ పనులను ఎమ్మెల్యే మేయర్ నీలారెడ్డి, కమిషనర్ వంశీకృష్ణలతో కలిసి పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, హెచ్ఎండీఏ ఎస్ఈ యూసుఫ్ హుస్సేన్, డీఈఈ వేణుగోపాల్, ఎలక్ట్రికల్ ఈఈ నవీన్‌కుమార్, ఏఈఈ రమేష్, టీఎస్ఎస్పీడీసీఎల్ కన్‌స్ట్రక్షన్ డీఈ శ్రీదేవి, ఏడీఈ గాయత్రి, కార్పొరేటర్లు పాల్గొన్నారు. అనంతరం నిజాంపేట్‌లో రూ.1.20 కోట్ల నిధులతో చేపడుతున్న మోడల్ గ్రేవ్‌యార్డు పనులను ఎస్ఈ సత్యనారాయణ, డీఈఈ సుదర్శన్, ఏఈ ధీరజ్‌లతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.

రోడ్డు విస్తరణకు నిధులొచ్చాయ్

- సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డు విస్తరణకు చర్యలు ప్రారంభం
- నిధులు మంజూరు చేసిన మంత్రి కేటీఆర్
- త్వరలోనే నాలుగు లైన్ల స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం
- తీరనున్న ట్రాఫిక్ కష్టాలు



పనులు చేపట్టనున్న సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డు

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్యే వివేకానంద చొరవతో సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డు విస్తరణ పనులకు మంత్రి కేటీఆర్ నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుకు ఒక వైపు నర్సాపూర్ రాష్ట్ర రహదారి మరో వైపు జాతీయ రహదారి అనుసంధానంగా ఉండడం వల్ల అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో స్థానికులతో పాటు వాహనదారులు ఎన్నో ఏళ్ల నుంచి ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, రోడ్డును విస్తరించాలని పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. గతంలో సుభాష్ నగర్ పైప్‌లైన్ రోడ్డు విస్తరణలో భాగంగా ప్రణాళికలు రూపొందించి సుమారు 147 నిర్మాణాలు రోడ్డుకు అడ్డుగా ఉన్నాయని గుర్తించి వారికి నోటీసులు జారీ చేశారు. అయితే అధికారుల నుంచి పూర్తిస్థాయిలో నివేదిక అందకపోవడంతో ఈ రోడ్డు విస్తరణ పనులు ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు అన్నట్లుగా మారింది. ఇక్కడ ప్రజల ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే వివేకానంద్ మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేసి తక్షణమే ఈ రోడ్డుకు నిధులు కేటాయించాలని కోరగా ఎట్టకేలకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సుమారు 80 అడుగుల విస్తీర్ణంలో ఈ రోడ్డు పనులు చేపట్టనున్నారు. మధ్యలో ఉన్న కల్వర్టు విస్తరణ సైతం చేపట్టనున్నారు.



మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

రూ.56 కోట్లతో స్టీల్ బ్రిడ్జ్.

పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ జీవో నెంబర్ 892 ద్వారా రూ.56 కోట్ల నిధులు మంజూరు చేశారు. మెదక్ రోడ్డు నుంచి నేషనల్ హైవేకు అనుసంధానం చేస్తూ సుమారు 3.8 కిలోమీటర్ల మేర ఉన్న ఈ ప్రధాన లింకు రోడ్డులో పరిశ్రమలు ఉన్నందున భారీ వాహనాలు వస్తుంటాయి. దీంతో సింగిల్ లైన్ రోడ్డు కావడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. భవిష్యత్తులో ఇటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ప్రస్తుతం 60 ఫీట్లు ఉన్న రోడ్డును 80 అడుగులతో నాలుగు వరుసల స్టీల్ బ్రిడ్జ్ నిర్మించనున్నారు. స్ట్రాటజిక్ రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ ఫేజ్–2 కింద టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. తన అభ్యర్థన మేరకు స్పందించి రూ.56 కోట్లు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే వివేకానంద్ ప్రజల తరపున మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలి



మహా సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్‌లో బీజేపీ విజయానికి కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శనివారం గాజులరామారంలోని సత్యగౌరి కన్వెన్షన్‌లో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జాయింట్ కన్వీనర్ రాముగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ మహా బూత్ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి కార్యకర్తలతో కలిసి ఆయన వర్చువల్‌గా జరిగిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్‌లో రూ.5వేల కోట్ల భూ స్కామ్ జరిగితే ఎన్ని కేసులు పెట్టారో, ఎంత మందిని అరెస్టు చేశారో చెప్పాలన్నారు. ప్రభుత్వ భూముల రక్షణగా నిలవాల్సిన ఎమ్మెల్యే భూ స్కామ్ జరుగుతుంటే ఏం చేస్తున్నారని, అతనికేమైనా భాగస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు. కుత్బుల్లాపూర్‌లో జరుగుతున్న భూకబ్జాలపై చర్చించేందుకు ఎమ్మెల్యేకు దమ్ము, ధైర్యం ఉంటే రావాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే తన జీతాన్ని ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఖర్చు చేస్తానని చెప్పారని, అయితే నేటికీ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ భారత రాక్షస సమితి పార్టీ అని, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి బీజేపీనే ప్రత్యామ్నాయమని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలొచ్చిన ప్రతీసారి కేసీఆర్ ఇచ్చే మోసపూరిత హామీలను బీజేపీ శ్రేణులు బస్తీల్లోని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకుల అరాచకాలను, అవినీతి, కబ్జాల పట్ల నిరంతర పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు గిరిగె శేఖర్‌ముదిరాజ్, భావిగడ్డ రవి, రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి, లక్ష్మీపతిరాజు, డివిజన్ అధ్యక్షులు, వివిధ మోర్చాల పదాధికారులు, డివిజన్ ఇన్‌చార్జిలు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సత్కారం

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును సత్కరిస్తున్న కుమ్మరి, గౌడ సంఘం ప్రతినిధులు



దుండిగల్: అన్ని సామాజికవర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. శనివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన గౌడ, కుమ్మరి సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ కుల సంఘం సమావేశాలు నిర్వహించుకోవడానికి స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి సహకరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, కుల సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ అందజేత

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి దయార్‌గూడకు చెందిన 13 సంవత్సరాల బాలుడు జక్కుల ధనుష్‌కుమార్ గత 7 సంవత్సరాలుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరాడు. ఈ విషయాన్ని దయార్‌గూడకు చెందిన మేకల రమేష్, గుండమళ్ల రాజేందర్‌లు కూకట్‌పల్లి బీఆర్ఎస్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన వారిని కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావుకు ధనుష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఎల్ఆర్ఐటీలో సంక్రాంతి వేడుకలు



దుండిగల్: దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో రంగవల్లులు, గొబ్బెమ్మలు, భోగి మంటలు వేయడంతో పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ వేడుకల్లో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి మమతారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు సాంప్రదాయ దుస్తులు ధరించి పతంగులు ఎగురవేస్తూ సందడి చేశారు. తెలుగు పండుగలు, సాంప్రదాయాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సంక్రాంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

రేపు టౌన్ వెండింగ్ కమిటీ మీటింగ్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని టౌన్ వెండింగ్ కమిటీ మీటింగ్‌ను ఈ నెల 9న సర్కిల్ కార్యాలయంలోని మీటింగ్ హాలులో నిర్వహించనున్నట్లు డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఉప కమిషనర్ మంగతాయారు అధ్యక్షతన జరిగే సమావేశంలో కొత్త వెండింగ్ జోన్ల ఏర్పాటు, వీధి వ్యాపారులకు బ్యాంక్ రుణాలు తదితర అంశాలపై చర్చిస్తారని, స్ట్రీట్ వెండర్లు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరు కావాలని శ్రీనివాస్ కోరారు.

పాఠశాల వార్షికోత్సవం



చింతల్: చింతల్ డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీ సెయింట్ మార్టిన్ పాఠశాల 24వ వార్షిక వేడుకలు (క్రిసాలిస్) శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల అధ్యక్షుడు మర్రి లక్ష్మణ్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ యాదవ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు రాజశేఖర్ యాదవ్, ప్రిన్సిపాల్ అనితారావు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం చదువుల్లో, క్రీడా పోటీల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

పార్శిల్ పేరుతో మోసం

జీడిమెట్ల: ప్రైవేట్ ఉద్యోగిని పార్శిల్ పేరిట మోసం చేసి ఆమె నుంచి రూ.1లక్ష 6వేలు దోచుకున్న ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కుత్బుల్లాపూర్ వెంకటేశ్వరనగర్‌కు చెందిన సౌమ్య(31)కు ఈ నెల 2న గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ముంబై కస్టమ్స్ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నట్లు చెప్పారు. మీ పేరిట అనుమానాస్పద పార్శిల్ వచ్చిందని, ఆ పార్శిల్‌ను ముంబై పోలీసులకు అప్పగిస్తున్నట్లు తెలిపాడు. తర్వాతి రోజు వేరే వ్యక్తి ఫోన్ చేసి తాను ముంబై పోలీస్ డిపార్ట్‌మెంట్ అని పరిచయం చేసుకున్నాడు. మీ పేరుపై వచ్చిన గుర్తు తెలియని పార్శిల్‌పై అనుమానం ఉందంటూ సౌమ్యను భయపెట్టాడు. పలుమార్లు ఫోన్ చేసి భయపెట్టడంతో సదరు వ్యక్తికి రూ.56,482 పంపింది. తర్వాతి రోజు ఫోన్ చేసి మరో రూ.50వేలు పంపాలని అడగగా రూ.49,999 పంపింది. రెండు సార్లు పంపిన అనంతరం మోసపోయానని గ్రహించిన ఆమె శనివారం జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

జీడిమెట్ల: అనారోగ్యానికి తోడు ఆర్థిక ఇబ్బందులు రావడంతో వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పవన్ వివరాల మేరకు.. కర్నూల్ జిల్లా నందికొట్కూర్ మండలం కొనిదెల గ్రామానికి చెందిన చంటన్న(27), భార్య పద్మ ఇద్దరు పిల్లలతో కలిసి అపురూప కాలనీలో ఉంటున్నాడు. అతడికి కిడ్నీలో నొప్పి రావడంతో పలుమార్లు అప్పు చేసి చూపించుకున్నాడు. అయినప్పటికీ నొప్పి తగ్గలేదు. శుక్రవారం చంటన్న పిల్లలకు జ్వరం రావడంతో అతడి భార్య పిల్లలను తీసుకుని తన బంధువుల ఇంటికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చిన పద్మ భర్త కోసం చూడగా సీలింగ్‌కు ఉరివేసుకుని కనిపించాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



రిసోనెన్స్ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

దుండిగల్: అనుమతి లేకుండా నడుపుతున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మేడ్చల్ జిల్లా ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం దుండిగల్‌లోని రిసోనెన్స్ కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్, మేడ్చల్ జిల్లా కన్వీనర్ నగేష్ మాట్లాడుతూ.. రిసోనెన్స్ కళాశాలకు ఎలాంటి పర్మిషన్ లేదని, ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా కళాశాల నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు విద్యార్థుల పరీక్ష ఫీజుల విషయమై ఎటువంటి ప్రకటన చేయకుండా కళాశాల యాజమాన్యం విద్యార్థులను అయోమయంలోకి నెడుతుందన్నారు. ఈ విషయమై మేడ్చల్ డీఐఈవోను సంప్రదించగా సోమవారం లోపు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. విద్యార్థులకు న్యాయం జరగకుంటే రాబోయే రోజుల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని, ఇంటర్ బోర్డును ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విష్ణు, మృత్యుంజయ, నగర కార్యదర్శులు దినేష్, నాగేంద్ర, అభిషేక్, రాజేష్, సాయి నాగేంద్ర, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక సేవ చేయడం అభినందనీయం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న చైర్‌పర్సన్ కృష్ణవేణి

దుండిగల్: సామాజిక సేవా కార్యక్రమాల్లో కార్పొరేట్ ఆస్పత్రి యాజమాన్యాలు పాలుపంచుకోవడం అభినందనీయమని దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి అన్నారు. శనివారం మల్లంపేట్‌లోని ప్రణీత లీఫ్ క్లబ్ హౌస్‌లో రంజిత్ ఆస్పత్రి, బ్రెజ్జ, మిలియనీర్ ఫార్మసీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు రంజిత, నవ్య, మౌనిక బీపీ, డయాబెటీస్, ఇతర సాధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రణీత లీఫ్ అసోసియేషన్ సభ్యులు, వైద్య సిబ్బంది సురేష్, మధు, నవ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పరిశ్రమలపై చర్యలు తీసుకోండి



జీడిమెట్ల ఎస్వీ కోఆపరేటివ్ సొసైటీకి వెళ్లే రోడ్డులో వ్యర్థాలకు నిప్పు పెట్టిన దృశ్యం

జీడిమెట్ల: పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వం ఎంత చెబుతున్నా కొంతమంది పెడచెవిన పెడుతున్నారు. పరిశ్రమలలో వెలువడిన వ్యర్థాలను కొంతమంది నిర్మానుష్య ప్రదేశాల్లో వేసి నిప్పు పెడుతున్నారు. దీంతో ఘాటైన రసాయనాల పొగలు వాతావరణంలోకి వెలువడుతున్నాయి. తద్వారా వాతావరణం కాలుష్యం అవుతుంది. ఓ వైపు ప్రభుత్వం, పర్యావరణ ప్రేమికులు వాతావరణ కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా వినిపించుకోవడం లేదు. పారిశ్రామికవేత్తలు వ్యర్థాలను బయట పారబోయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కొంతమంది ఎస్వీ కోఆపరేటివ్‌కు వెళ్లే దారిలో నిత్యం వ్యర్థాలు పారబోసి నిప్పుపెడుతున్నారని ప్రజలు అంటున్నారు. మంటలతో పొగలు వ్యాపించి కళ్లల్లో మంటలు వస్తున్నాయని ఆ రోడ్డులో వెళ్లే కార్మికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఇలా అధికారులు రోడ్లపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వ్యర్థాలకు నిప్పు పెడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్రాంతికి ఊరెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి



ఆటో ద్వారా ప్రచారం ప్రారంభించిన జగద్గిరిగుట్ట పోలీసులు

జగద్గిరిగుట్ట: సంక్రాంతి పండుగకు ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని జగద్గిరిగుట్ట సీఐ సైదులు అన్నారు. శనివారం స్టేషన్ ఆవరణలో పండుగకు వెళ్లే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు ఆటో ద్వారా ప్రచారం ప్రారంభించారు. ఇంట్లో విలువైన వస్తువులు ఉంచరాదని, బ్యాంక్ లాకర్లలో గాని బంధువుల వద్ద భద్రపరుచుకోవాలన్నారు. ఇళ్లకు తాళం వేసి వెళ్తే పోలీస్‌స్టేషన్ లేదా పక్కింటి వారికి చెప్పి వెళ్లాలని, మీ ప్రాంతాల్లో అపరిచితులు తిరుగుతుంటే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

నగర శివారులో వాహనాల తనిఖీలు



పేట్‌బషీరాబాద్ పీఎస్ పరిధిలో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

కుత్బుల్లాపూర్: నగరంలో గొలుసు దొంగలు రెచ్చిపోవడంతో నగర శివారు ప్రాంతంలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. పేట్‌బషీరాబాద్, జీడిమెట్ల, దుండిగల్, జగద్గిరిగుట్ట, బాచుపల్లి పీఎస్‌ల పరిధిలోని ప్రధాన రోడ్లపై శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వాహనాల తనిఖీలు కొనసాగించారు. సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ ఇలా మూడు కమిషనరేట్ల పరిధిలో చెకింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు రావడంతో ఒక్కసారిగా పోలీసులు రోడ్లపైకి వచ్చి తనిఖీలు చేపట్టారు.

కొనసాగుతున్న బాక్సింగ్ పోటీలు



బాక్సింగ్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు

జగద్గిరిగుట్ట: మూడవ టీఏఎఫ్ఐఎస్ఏ జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీలు కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్‌లో కొనసాగుతున్నాయి. ఈ నెల 5న ప్రారంభమైన పోటీలు 8వ తేదీ వరకు జరుగనున్నాయి. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ గర్ల్స్, బాయిస్ విభాగాల్లో జరుగుతున్న పోటీల్లో పలు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని సత్యసాయినగర్‌లో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సత్యసాయినగర్ వాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను కార్పొరేటర్ తన దృష్టికి తీసుకువచ్చారని, దీంతో అధికారులతో సంప్రదించి పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమస్యపై స్పందించి వెంటనే పరిష్కారం చూపినందుకు స్థానికులు ఎమ్మెల్యే కృష్ణారావుకు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కంచి భిక్షపతి, సుదర్శన్‌రెడ్డి, అంబటి శ్రీనివాస్, తుమ్మ జగదీష్, మల్లేష్, కవిత, మహేష్, వెంకటేష్, కన్నయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.